

రాజీనామా రగడ..!

మీరు చేస్తారా.. మమ్ములను చేయమంటారా..!

కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వైసీపీ సభ్యుల అల్టిమేటం



కదిరి, అక్టోబరు 10: మున్సిపాలిటీలో ముసలం పుట్టుకొచ్చింది. చైర్‌పర్సన్ నజీమున్నీషా రాజీనామా చేయాలంటూ వైసీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తామే చేస్తామంటూ అల్టిమేటం జారీ చేస్తూ.. మున్సిపల్ చైర్‌పర్సన్‌కు లేఖ పంపారు. నాలుగేళ్లుగా అభివృద్ధి లేదని మండిపడుతున్నారు. చైర్‌పర్సన్ బంధువులపై పలు అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. చైర్‌పర్సన్ రాజీనామా చేయకపోతే తామే చేస్తామంటూ 16 మంది కౌన్సిలర్లు ఏకతాటిపైకి వచ్చినట్లు సమాచారం. రెండేళ్ల క్రితమే ఇది తారస్థాయికి చేరినా, అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడంతో తొక్కిపెట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మళ్లీ చైర్‌పర్సన్ రాజీనామా అంశం తెరపైకి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పట్నుంచి చైర్‌పర్సన్ చాంబర్‌కు రాకుండా ముఖం చాటేశారు. ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో వేచిచూడాల్సిందే.

రాజీనామాకు పట్టు

చైర్‌పర్సన్ రాజీనామా కోరుతూ 16 మంది వైసీపీ కౌన్సిలర్లు రెండ్రోజుల క్రితం సమావేశమయ్యారు. కౌన్సిలర్లుగా గెలిచి, నాలుగేళ్లయినా వార్డులో ఒక్క అభివృద్ధి పనికూడా చేయలేకపోయామని వారు వాపోయారు. చిన్నచిన్న పనులు కూడా చేయలేక ప్రజల ముందుకు వెళ్లలేకపోతున్నామని బాధపడుతున్నారు. గతంలో వైసీపీ హయాంలో చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా రెండున్నరేళ్లకే మారుస్తామని హామీ ఇచ్చినట్లు ఆ పార్టీ కౌన్సిలర్లు చెబుతున్నారు. నాలుగేళ్లయినా చైర్‌పర్సన్ రాజీనామా చేయకపోవడం, వైసీపీ అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ కౌన్సిలర్ల ఆశలు అడియాసలయ్యాయి. ఈనేపథ్యంలో ఎలాగైనా ఒత్తిడి తెచ్చి, ఉన్న ఒక్క సంవత్సర కాలంలోనైనా చైర్‌పర్సన్‌ను మార్చేలా పట్టుబట్టాలని వైసీపీ కౌన్సిలర్లు యోచిస్తున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే నాలుగు సంవత్సరాలు పూర్తి కావాల్సిందే. అందుకు ఇంకా ఐదునెలల సమయం ఉంది. దీంతో వైసీపీ అసమ్మతి కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్‌పై ప్రత్యక్షంగా ఒత్తిడి తేవడం మొదలుపెట్టారు. కౌన్సిల్‌లో 36 మంది సభ్యులుండగా.. ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లు, 30మంది వైసీపీ, ఒకరు స్వతంత్ర సభ్యులు ఉన్నారు. ఎన్నికల ముందు స్వతంత్ర అభ్యర్థితోపాటు మరో ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు. దీంతో వైసీపీ కౌన్సిలర్ల సంఖ్య 24కు తగ్గింది. ప్రస్తుతం 16మంది కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్‌పై అసమ్మతి ప్రకటించారు. వీరిలో మొదటి వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవి కూడా ఉండడం విశేషం. ఇక చైర్‌పర్సన్ వైపు మిగిలింది 8 మందే. వీరిలో చైర్‌పర్సన్, రెండో వైస్ చైర్‌పర్సన్ పోగా.. ఆరుగురు మాత్రమే ఉంటారు. మెజార్టీ వైసీపీ కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్ రాజీనామా డిమాండ్ చేస్తున్నారు. గురువారం అసమ్మతి కౌన్సిలర్లలో కొంతమంది నేరుగా చైర్‌పర్సన్‌కు అసమ్మతి అభ్యర్థనను అందించినట్లు తెలిసింది.



మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా చేయాలని కౌన్సిలర్లు ఇచ్చిన లేఖ

కేసుల్లో బంధువులు

చైర్‌పర్సన్ నజీమున్నీషా పదవీ బాధ్యతలు చేపట్టినప్పట్నుంచి అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయంటూ పెద్దఎత్తున ఆరోపణలున్నాయి. కాసులు ముట్టనిదే ఏ పనీ చేయట్లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగానే వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) వేయాలంటే చైర్‌పర్సన్ భర్త స్వయంగా తయారు చేయించుకున్న ఓ రబ్బర్ స్టాంపును ఆ పత్రాలపై వేస్తేకానీ అనుమతివ్వకూడదని షరతు పెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈవిషయంపై అప్పట్లో సభ్యులు.. కౌన్సిల్ భేటీలోనే ప్రశ్నించారు. గట్టుచప్పుడుకాకుండా తుక్కు అమ్మేసిన కేసులో చైర్‌పర్సన్ భర్త సాదిక్ బాషా నిందితుడు. చర్చి ఆస్తుల కేసులో చైర్‌పర్సన్ బంధువులైన పరికి షామీర్, ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన మగ్బుల్ అహమ్మద్ నిందితులు. మున్సిపాలిటీలో డీజిల్ అవకతవకల్లో కూడా చైర్‌పర్సన్ బంధువులపై అవినీతి ఆరోపణలు వినిపించాయి. ఇదే విషయాన్ని పలువురు కౌన్సిలర్లు ప్రస్తావిస్తున్నారు. అభివృద్ధి మానేసి, మున్సిపాలిటీని అవినీతివైపు చైర్‌పర్సన్ బంధువులు నడిపించారన్న విమర్శలున్నాయి.

ముఖం చాటేసిన చైర్‌పర్సన్

కూటమి అధికారంలోకి రాగానే చైర్‌పర్సన్ తన చాంబర్‌కు రావడం మానేసినట్లు పలువురు కౌన్సిలర్లు చెబుతున్నారు. అధికారులు.. ఫైళ్లపై సంతకాలకోసం చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. ఏకంగా ఫైళ్లను ఇంట్లోనే పెట్టుకోవడంపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల కథనాలు ప్రచురించింది. దీనిపై కౌన్సిల్‌లో సభ్యులు ప్రస్తావించారు. ఆ ఫైళ్లు అప్పజెబుతామని కౌన్సిలర్లకు చైర్‌పర్సన్ సమాధానమిచ్చారు. దాదాపు ఆరు నెలల్లో రెండు కౌన్సిల్ సమావేశాలు మాత్రమే నిర్వహించారు. ప్రతినెలా నిర్వహించడంలో చైర్‌పర్సన్ విఫలమయ్యారని కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు.

కౌన్సిలర్ల అల్టిమేటం

చైర్‌పర్సన్ రాజీనామా చేయకపోతే తాము చేస్తామని 16 మంది వైసీపీ కౌన్సిలర్లు స్పష్టం చేస్తున్నారు. ఈమేరకు చైర్‌పర్సన్ నజీమున్నీషాకు అల్టిమేటం జారీ చేశారు. వారంపాటు వేచి చూస్తామనీ, తరువాత తమ కార్యచరణ ప్రారంభిస్తామని చెప్పినట్లు సమాచారం. దీంతో ఎలాంటి మలుపులు ఉంటాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఏకాంబరేశ్వరీ నమోస్తుతే..

హిందూపురం అర్బన్, అక్టోబరు 10: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఎనిమిదో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. హిందూపురంలో ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ మాతను ఏకాంబరేశ్వరిగా అలంకరించి, పూజలు నిర్వహించారు.



ఏకాంబరేశ్వరీదేవిగా వాసవీమాత

మోహినిగా మురిపించిన శ్రీహరు

కదిరి: పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు గురువారం మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాల అనంతరం మోహినీ అలంకారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.



మోహినీ అలంకారంలో దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

ప్రశాంతి నిలయంలో ఘనంగా ఆయుధపూజ

పుట్టపర్తి, అక్టోబరు 10: ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆయుధ పూజను గురువారం ఘనంగా నిర్వహించారు. బంగారు రథం, సత్యసాయి ఉపయోగించిన వాహనాలను సభామండపానికి తీసుకొచ్చి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి అయుధ పూజ నిర్వహించారు. ప్రముఖ పండితుడు బాసంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సత్యసాయి విద్యార్థులు భక్తిగీతాలను ఆలపించారు.



ఆయుధపూజ చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

జేసీకి పుడా వైస్ చైర్మన్ బాధ్యతలు

పుట్టపర్తి, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ (పుడా) వైస్ చైర్మన్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) అభిషేక్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఉతర్వులు జారీ చేశారు. గతేడాది మార్చిలో పుడా వైస్ చైర్మన్ సెలవులో వెళ్లారు. ఆ తరువాత పుట్టపర్తి, ధర్మవరం మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ డైరెక్టర్లకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ నెట్టుకొచ్చారు. తాజాగా రాష్ట్రంలో 14 పట్టణాభివద్ధి సంస్థలకు వైస్ చైర్మన్లను నియమించారు. పుడా వైస్ చైర్మన్‌గా జేసీకి అదనపు పూర్తి బాధ్యతలు అప్పగించారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు ఆపరేషన్ స్వేచ్ఛ: ఎస్పీ

కదిరి అర్బన్, అక్టోబరు 10: వెట్టిచాకిరీ నిర్మూలనకు పోలీసు, సాంఘిక సంక్షేమ, కార్మిక, చైల్డ్‌లైన్ శాఖల సయన్వయంతో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎస్పీ రత్న పేర్కొన్నారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో గురువారం బాలకార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. వారంరోజులపాటు ఆపరేషన్ స్వేచ్ఛ పేరుతో జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు. కర్మాగారాలు, హోటళ్లు, వ్యాపార సముదాయాల్లో వెట్టిచాకిరీ బారినపడిన వారిని గుర్తించి, పునరావాసం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. బాలకార్మికులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వెట్టిచాకిరీ చేయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో దాదాపు 50 మంది బాలకార్మికులను పట్టణ పోలీసులు గుర్తించారన్నారు. వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, పిల్లలకు ఇష్టమైన వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు నారాయణరెడ్డి, మోహన్, కార్మిక శాఖాధికారి జబురుద్దీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

వరద బాధితులకు సాయం





సీఎం సహాయనిధికి చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత, చెక్కును మంత్రి లోకేశ్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

పుట్టపర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల పుట్టపర్తి, పెనుకొండ ప్రజలు తమ వంతు సాయం అందించారు. పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల తరఫున రూ.25 లక్షల సాయాన్ని సీఎం సహాయ నిధికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘనాథ రెడ్డి అందజేశారు. అందుకు సంబంధించిన చెక్కును అమరావతిలోని సచివాలయంలో గురువారం రాష్ట్ర విద్య, ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అందజేశారు.

పెనుకొండ నుంచి రూ.3.50 లక్షలు

విజయవాడ వరద బాధితులకు పెనుకొండ నియోజకవర్గ ప్రజలు రూ.3.50 లక్షల సాయం అందించారు. ముఖ్యమంత్రి సహాయనిధికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అందించారు. అందుకు సంబంధించిన చెక్కును రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండలి సమావేశం అనంతరం సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత అందించారు.

పుట్టపర్తిలోనూ రతన్‌టాటా సేవలు

- 2009లో ప్రశాంతి నిలయం సందర్శన
- సత్యసాయి సేవల పరిశీలన
- తానూ పాలుపంచుకుంటానంటూ బాబాకు విన్నపం
- విద్యావాహిణి ప్రాజెక్టుకు సహకారం



సత్యసాయిబాబాతో రతన్‌టాటా (ఫైల్)

పుట్టపర్తి, అక్టోబరు 10: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు పుట్టపర్తితో విడదీయరాని బంధం ఉంది. సామాజిక సేవ, దాతృత్వం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రతన్ టాటా.. సత్యసాయి బాబా సూచన మేరకు విద్యావాహిణి ప్రాజెక్టుకు సహకారం అందించారు. సత్యసాయిబాబాతో రతన్‌టాటాకు విడదీయరాని అనుబంధం ఉండేది. సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, సేవలకు ఆకర్షితుడైన రతన్‌టాటా మొదటిసారి 2009 డిసెంబరు 3న ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. సత్యసాయి ధర్మవనంలో సేవలను స్వయంగా పరిశీలించారు. తాను సైతం సేవా కార్యక్రమాల్లో భాగస్వాముడినవుతానని బాబాను కోరారు. దీంతో సత్యసాయిబాబా.. శ్రీసత్యసాయి విద్యావాహిణి ప్రాజెక్టులో పాలుపంచుకోవాలని బాబా సూచించారు. 2010 నవంబరు 23న సత్యసాయి తన పుట్టిన రోజు వేడుకల సందర్భంగా శ్రీసత్యసాయి విద్యావాహిణి ప్రాజెక్టును ప్రారంభించారు. మొదటి విడతలో 9 లక్షల మందికి విద్య అందించడానికి రతన్ టాటా ముందుకొచ్చారు. తద్వారా మాతృభూమికి సేవ, బాధ్యతాయుత, ఆధ్యాత్మిక సేవలతో కూడిన విలువల విద్యను అందించి, దృఢసంకల్పం కలిగిన యువతను తయారు చేసేందుకు విద్యావాహిణి ప్రాజెక్టు పనిచేసింది. ప్రాజెక్టులో వేలాదిమంది ఉపాధ్యాయులు చేరి.. లక్షలాది మంది విద్యార్థులకు పాఠాలు బోధించారు. అలా రతన్‌టాటా.. సత్యసాయి సేవలకు తన వంతు సహకారం అందించి, భక్తిని చాటుకున్నారు. పుట్టపర్తితో విడదీయరాని బంధం ఏర్పరచుకున్నారు.



సత్యసాయికి పాదాభివందనం చేస్తున్న రతన్ టాటా (ఫైల్)

23న ఏపీ నర్సుల సంఘం ఎన్నికలు

అనంతపురం టౌన్, అక్టోబరు 10: ఏపీ నర్సుల సంఘం ఎన్నికలను ఉమ్మడి జిల్లాలో ఈ నెల 23న నిర్వహిస్తామని ఎన్నికల అధికారి, కో ఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్ తెలిపారు. ఓటరు జాబితాను జిల్లా ఆస్పత్రిలో గురువారం ఆయన ప్రకటించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెగ్యులర్ నర్సులు 248 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13లోగా తెలపాలని సూచించారు. ఓటర్ల తుది జాబితాను 14న ప్రకటిస్తామని, 16న నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. 17న పరిశీలన, 18న ఉపసంహరణ ఉంటుందని అన్నారు. 23న ఎన్నికలు నిర్వహిస్తామని, జాబితాలో ఉన్న నర్సులు మాత్రమే ఓటు వేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

టమోటా కిలో రూ.50

అనంతపురం రూరల్, అక్టోబరు 10: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.24 పలికినట్లు ఆయన తెలిపారు.

ఎందుకంత హడావుడి..?

- నిర్మాణాత్మక చర్యలు లేకుండా కొత్త సర్కిల్
- అధికారుల నియామకంతో సరి..
- కార్యాలయం ఎక్కడ..?
- ఉమ్మడి జిల్లా విద్యుత్ సర్కిల్ విభజనపై విమర్శలు
- కోర్టును ఆశ్రయించిన ఉద్యోగ సంఘాల జేఏసీ



విద్యుత్‌శాఖ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యాలయం

అనంతపురం రూరల్, అక్టోబరు 10: ఉమ్మడి అనంతపురం విద్యుత్ సర్కిల్ విభజనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో నిర్మాణాత్మక చర్యలు చేపట్టకనే శ్రీసత్యసాయి జిల్లా సర్కిల్ ఏర్పాటు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో అనంతపురం సర్కిల్ విభజనపై కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం కోర్టులో ఉండగానే సంస్థ ఉన్నతాధికారులు విభజన ప్రక్రియను ప్రారంభించారు. పలు క్యాడర్ల అధికారులను శ్రీసత్యసాయి జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే క్రమంలో సంస్థ సీఎండీ ఎస్ఈని నియమించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు విభజన మంచిదే అయినా.. సర్కిల్ ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకుండా, హడావుడి చేయడం సరికాదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇదేం పద్ధతి..?

ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ సర్కిల్ విభజనకు ఏపీఎస్పీడీసీఎల్ శ్రీకారం చుట్టింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్ సర్కిల్‌గా విడగొడుతోంది. అనంతపురం సర్కిల్‌కు 58 మంది, శ్రీసత్యసాయి జిల్లాకు 55 మంది అధికారులను కేటాయిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ శ్రీసత్యసాయి జిల్లాలో ఇప్పటి వరకూ సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు అడుగులు పడింది లేదు. సత్యసాయి ట్రస్టు భవనాల్లో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలంటున్నా.. అదీ జరగలేదు. కొత్తగా పోస్టులు కేటాయించకుండా.. ఉన్నవారినే సర్దుబాటు చేశారు. ఎస్ఈ, ఈఈటీ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఏఓ పోస్టులను మాత్రం సంస్థ కొత్తగా కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. డివిజన్, సబ్ డివిజన్, ఏఈ తదితర పోస్టులను అనంతపురం సర్కిల్ నుంచి కేటాయించారు. దీనిపై ఉద్యోగ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, ఉద్యోగులను కేటాయించకుండా, ఎలాంటి ఏర్పాట్లు చేయకుండా సర్కిల్ ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

కోర్టును ఆశ్రయించిన జేఏసీ

హడావుడిగా నూతన సర్కిల్ ఏర్పాటు,అధికారులను, ఉద్యోగులను సర్దుబాటు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. శాఖలోని ఉద్యోగ సంఘాల నేతలు సీఎండీని ఇటీవల కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఇదే అంశంపై జేఏసీ నాయకులు కోర్టును కూడా ఆశ్రయించినట్లు తెలుస్తోంది. శాఖలోని అధికారులు, ఉద్యోగులు ఇబ్బంది పడకుండా విభజన ప్రక్రియ చేపట్టాలని సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి.. సలహాలు, సూచనలు తీసుకుని విభజన చేస్తే బాగుంటుందని వారు అంటున్నారు.

ఎస్ఈ నియామకంపై విమర్శలు..

గతంలో ఉమ్మడి జిల్లా ఎస్ఈగా పనిచేసిన సురేంద్రను శ్రీసత్యసాయి జిల్లా ఎస్ఈగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన నియామకం పట్ల వివిధ వర్గాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఆ అధికారి కొన్నేళ్లు జిల్లాలో పనిచేశారు. అనంతపురం డివిజన్ ఈఈగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొంది ఎస్ఈగా ఇక్కడికే పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఎస్ఈగా పనిచేస్తూ, గత ప్రభుత్వంలో వైసీపీ వారికి అడ్డదిడ్డంగా పనులు చేసి లబ్ధిచేకూర్చరన్న విమర్శలు మూటగట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయన తిరుపతి ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి వెళ్లకుండా ఉండేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేశారు. జిల్లాలో తనకు అనుకూలమైన వారిని తప్ప.. ఇతరులను ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అలాంటి అధికారిని తిరిగి జిల్లా ఉన్నతాధికారిగా నియమించడం ఏమిటని బాధితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆయన వస్తే మళ్లీ ఎలాంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందో అని ఆందోళన చెందుతున్నారు. పండగ తరువాత ఆయన విధుల్లో చేరుతారని సమాచారం.

మానసిక రోగులను ఇబ్బంది పెడితే చర్యలు

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్

అనంతపురం టౌన్, అక్టోబరు 10: మానసిక రోగులపట్ల వివక్ష చూపితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ హెచ్చరించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం ఏపీ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షుడు, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఎంఏ హాల్‌లో సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బుద్ధిమాంద్యం, వివిధ జబ్బుల కారణంగా మానసికంగా బాధపడేవారికి హాని కలిగించినా, అవమానించినా, లైంగికంగా వేధించినా చర్యలు తప్పవని అన్నారు. ప్రస్తుతం సమాజంలో మానవ సంబంధాలకంటే సెల్‌ఫోన్ సంబంధాలకే ఎక్కువ విలువ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ సంబంధాలు దెబ్బతినడం మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని అన్నారు. అందుకే ప్రతి కుటుంబం మంచి మిత్రులను, గురువులను కలిగి ఉండాలని అన్నారు. తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ప్రశాంతమైన జీవితం కోసం యోగ, ప్రాణాయామం, సానుకూల దృక్పథం వంటివి అలవర్చుకోవాలని సూచించారు. మానసిక ఒత్తిడి వల్ల అనేక సమస్యలు, రోగాలు వ్యాపిస్తాయని డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ అన్నారు. ఒత్తిడి కారణంగా చిన్న వయసులోనే రక్తపోటు, షుగర్, గుండెపోటు వంటి వ్యాధులు వస్తున్నాయని అన్నారు. సమస్యలను తోటివారితో పంచుకుంటే పరిష్కారం దొరకుతుందని అన్నారు. మానసిన రుగ్మతలపై అవగాహన కల్పించడానికి తమ సంస్థ తరఫున అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మురళీక్రిష్ణ, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రసూన, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, డాక్టర్ పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఉద్యోగుల బదిలీ

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 10 : జేఎన్‌టీయూలో పలువురు బోధనేతర ఉద్యోగులను బదిలీ చేస్తూ గురువారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్‌లు దుర్గాప్రసాద్, మధుసూదన్‌రెడ్డి. ఏఆర్‌లు శంకర్‌రెడ్డి, మురళీమోహన్‌రావు, ప్రభాకర్, లింగప్ప, అబ్దుల్ ఖాదర్‌ను బదిలీచేశారు. అలాగే సూపరింటెండెంట్లు శివశంకర్ గౌడ్, శ్రీనివాసులు, సునీల్‌కుమార్‌తో పాటు మరో ఎనిమిది మంది ఇతర ఉద్యోగులు బదిలీ అయ్యారు.

భర్త ప్రవర్తనతో విసిగి.. హత్య

ధర్మవరం రూరల్, అక్టోబరు 10: భర్త ప్రవర్తనతో విసిగిపోయిన భార్య చంపేసింది. నిద్రిస్తున్న సమయంలో తలపై రోకలితో మోది కడతేర్చింది. ధర్మపురి గ్రామానికి చెందిన దేవరకొండ గోవిందు (56)ను ఆయన భార్య అంజినమ్మ గురువారం హత్య చేసింది. గోవిందు, అంజినమ్మకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గోవిందు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడంటూ భార్య గొడవ పడుతుండేది. ఈ నేపథ్యంలో గురువారం పొలానికి వెళ్లివచ్చిన గోవిందుతో భార్య అంజినమ్మ గొడవపడింది. అన్నం తిని ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న గోవిందు తలపై రోకలితో బలంగా మోదింది. దీంతో గోవిందు అక్కడికక్కడే మృతిచెందాడు. అంజినమ్మ చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. వారి ద్వారా సమాచారం అందుకున్న ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాసులు హత్యాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గోవిందు కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. అంజినమ్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చెక్‌బౌన్స్ కేసులో హెచ్ఎంకు జైలు

పెనుకొండ టౌన్, అక్టోబరు 10: చెక్‌బౌన్స్ కేసులో హిందూపురం మండలం ముదిరెడ్డిపల్లికి చెందిన ప్రధానోపాధ్యాయురాలు అంజనీ లక్ష్మీకళకు ఆరు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. కోర్టు కానిస్టేబుల్ బాబ్జాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంజనీలక్ష్మీకళ ప్రస్తుతం ముదిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. 2022లో పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ వద్ద రూ.6.72లక్షలు అప్పుగా తీసుకుంది. తిరిగి చెల్లించక పోవడంతో చెక్కు తీసుకున్నారు. దానిని బ్యాంకులో వేశారు. అది బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయాధికారి బొజ్జప్ప.. హెచ్ఎం అంజనీలక్ష్మీకళకు ఆరునెలల సాధారణ జైలుశిక్షతోపాటు రూ.13.44 లక్షల అపరాధ రుసుం విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెలన్నర జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మాట్లాడుతున్న నాగమద్దయ్య

కళ్యాణదుర్గం రూరల్/అనంతపురం అర్బన్, అక్టోబరు 10: మద్యం దుకాణాలకు శుక్రవారం రాత్రి 7 గంటల వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. కళ్యాణదుర్గం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో లైసెన్స్ ఫీజు మూడు విడతల్లో చెల్లించాల్సి ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఆరు పర్యాయాలు చెల్లించే వెసలుబాటు కల్పించిందని అన్నారు. దుకాణదారులకు 20 శాతం మార్జిన్ కల్పించిందని అన్నారు. దరఖాస్తుదారులకు ఇది ఒక మంచి అవకాశమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 136 మద్యం షాపులకు ఇప్పటిదాకా 1927 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 87 మద్యం దుకాణాలకు 945 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఈ నెల 14న అనంతపురంలోని రెవెన్యూ భవన్‌లో లాటరీ తీసి మద్యం దుకాణాలను కేటాయిస్తామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో దుకాణాలను పుట్టపర్తిలోని సాయి ఆరామంలో లాటరీ తీసి కేటాయిస్తామని అన్నారు. అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి పాల్గొన్నారు.

- ఇప్పటి వరకూ అనంతపురం అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని 41 దుకాణాలకు 656 దరఖాస్తులు, బుక్కరాయసముద్రం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకు 384, గుత్తి పరిధిలో 18 దుకాణాలకు 132, గుంతకల్లులో 14 దుకాణాలకు 118, ఉరవకొండ 7 దుకాణాలకు 184, తాడిపత్రి 16 దుకాణాలకు 76, కణేకల్లు ఆరు దుకాణాలకు 116, రాయదుర్గంలో ఎనిమిది దుకాణాలకు 168, కళ్యాణదుర్గంలో ఏడు దుకాణాలకు 66, కంబదూరులో నాలుగు దుకాణాలకు 27 దరఖాస్తులు వచ్చాయి.

సైనిక్, నవోదయ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

తిరుపతి(విద్య), అక్టోబరు 10: వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో గురువారం సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల స్టడీ మెటీరియల్స్‌ను ఎమ్మెల్సీ, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రామచంద్రారెడ్డి, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డిలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర నాయకులు శ్రీనివాసులరెడ్డి, వాసుదేవయ్య, రవీంద్రారెడ్డి, భాస్కర్‌రాజు పాల్గొన్నారు. వివరాలకు 8688888802, 9299976999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పశుపోషణతో అధికాదాయం

- పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర అధికారి డాక్టర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

రాప్తాడు, అక్టోబరు 10: పాడి పశువుల పెంపకంలో పశువైద్యాధికారుల సూచనలు, మెలకువలు పాటిస్తే అధిక ఆదాయం పొందవచ్చని పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మరూరులోని చిన్న కదరయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన.. రైతుతో మాట్లాడారు. దూడలు త్వరగా ఎదకు రావడానికి జున్ను పాలు, మేత, దాణా ముఖ్యమని అన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ 90 శాతం ఖచ్చితత్వం ఉన్న లింగ నిర్ధారిత వీర్య ఎద సూదులను నవంబరు 2022 నుంచి గ్రామస్థాయి వరకూ సరఫరా చేస్తోందని అన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా 90 శాతం సత్ఫలితాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారని అన్నారు. లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతోందని, గ్రామంలో అత్యధిక పాడి కొరకు ఈ పథకం చాలా బాగుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పుట్టిన 15 పెయ్య దూడలు, సాధారణ వీర్యం ద్వారా పుట్టిన దూడలను గ్రామంలో ప్రదర్శించారు. ప్రదర్శనలో పాల్గొన్న మరూరు రైతులు ఓబిరెడ్డి, నరసింహులు, కదిరప్పకు పాలక్యాన్లను ఆయన బహుమతిగా అందచేశారు. దూడల పోషణకు మంచి దాణా అందిస్తున్నారని, సకాలంలో ఎద సూదులు వేయించి.. ఇతర రైతులకు దూడలు పంపిణీ చేస్తున్న బండమీదపల్లి రైతు ఉప్పర నరసింహులును సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు స్టీల్ బాక్సులు, కాల్షియం టానిక్ బాటిల్స్, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. పశు వైద్యాధికారులు వెంకటస్వామి, సుధాకర్, రమేష్‌రెడ్డి, ప్రకాష్, వినోద్‌కుమార్, సోమేశ్వరి పాల్గొన్నారు.

మంచి రోజులు..!

- పల్లె దారులకు రూ.100 కోట్లు
- మార్చిలోగా పనులు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు
- వైసీపీ హయాంలో దెబ్బతిన్న రోడ్లు

అనంతపురం సిటీ, అక్టోబరు 10: వైసీపీ హయాంలో మరమ్మతులకు నోచుకోని పల్లె దారులకు కూటమి ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామీణ రహదారుల దుస్థితిని తెలుసుకుని.. వాటిని బాగు చేసేందుకు అంచనా నివేదికలను తీసుకున్నారు. జిల్లా యంత్రాంగం రూ.100 కోట్లు కావాలని అడగటంతో.. ఒక్క పైసా కూడా తగ్గించకుండా మంజూరు చేసింది. మార్చిలోపు పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా పల్లెరోడ్ల రూపురేఖలు త్వరలో మారనున్నాయి. వైసీపీ హయాంలో రెండేళ్లపాటు నామమాత్రపు నిధులు ఇచ్చారు. ఆ తరువాత పట్టించుకోకపోగా.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.100 కోట్లను జిల్లాలోని ప్రతి మండలానికి రూ.3 కోట్లు చొప్పున కేటాయిస్తున్నారు. పరిస్థితి మరింత అధ్వానంగా ఉన్న మండలాలకు ఇంతకంటే ఎక్కువగా నిధులను కేటాయించారు. మొత్తం నిధులలో బీటీ రోడ్లకు రూ.7 కోట్లు, సీసీ రోడ్లకు రూ.93 కోట్లు కేటాయించారు.

ఐదేళ్లు నరకం

వైసీపీ పాలనలో ప్రభుత్వం రహదారుల గురించి పట్టించుకోలేదు. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. గుంతల రోడ్లలో ప్రమాదాలు జరిగి.. కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. వర్షం వస్తే అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి ఉండేది. వైసీపీ ఐదేళ్ల పాలనలో రెండు దఫాలు మాత్రమే, అదీ వీఐపీల కార్యక్రమాలు ఉన్నప్పుడు అరకొర నిధులు మంజూరు చేశారు. ఉరవకొండ, రాప్తాడు, తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో గ్రామీణ రహదారులు ఎక్కువ శాతం దెబ్బతిన్నాయి. భరించలేక కొన్ని పల్లెల్లో ప్రజలు చందాలు వేసుకుని మట్టి రోడ్లు వేసుకున్నారు. కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన పనులను ఉపాధి పథకం కింద చేపట్టనున్నారు. తద్వారా గ్రామీణ ప్రాంత కాంట్రాక్టర్లకు పనులు చేసే అవకాశం దక్కనుంది. వైసీపీ హయాంలో టెండర్లు పిలిచినా పలకని కాంట్రాక్టర్లు.. తాజాగా పనులను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు.



రాయలచెరువులోని రైల్వేస్టేషన్ దారి ఇలా..

నిధులు మంజూరయ్యాయి..



గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ అదేశాలు ప్రకారం ప్రణాళికాబద్ధంగా పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పనులను వేగంగా పూర్తి చేయిస్తాం. పనుల్లో నాణ్యత పాటిస్తాం. సంక్రాంతి పండగలోగా ఎక్కువ శాతం పనులను పూర్తి చేస్తాం. -జహీర్ అస్లాం, పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈ



పామిడి మండలం ఎదురూరు గ్రామంలో ఇలా..



ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామంలో రోడ్డు దుస్థితి..



యాడికిలోని మార్కెట్‌కు వెళ్లే దారి

ఘనంగా దుర్గాష్టమి


పుట్టపర్తి : గాయత్రీమాత


కదిరి : మల్లాలమ్మ దేవి


తనకల్లు : చౌడేశ్వరీ అమ్మవారు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. దేవీశరన్నవ రాత్రుల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని గాయత్రీ అమ్మవారు, సత్యమ్మ అమ్మవారు, చిత్రావతీరోడ్ హారతిఘాట్ గంగాభవానీ అమ్మవార్లకు దుర్గామాత అలంకరణ చేశారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పలు దేవాలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్నారు. బుక్కపట్నంలో చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


బుక్కపట్నం : చౌడేశ్వరీమాత


ధర్మవరం : వాసవీమాత


కొత్తచెరువు : వాసవీమాత

తపాలా సేవలపై అవగాహన

తనకల్లు, అక్టోబరు 10: ప్రపంచ తపాలా వారోత్సవాల్లో భాగంగా తపాలా సేవలపై ఐపీఓ గోవర్ధన్‌నాయక్ ఆధ్వర్యంలో తనకల్లులో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో మండలంలోని తపాలా శాఖలో పనిచేస్తున్న బీపీఎంలు, అసిస్టెంట్ బీపీఎంలు, ఉద్యోగులు, ఎస్‌పీఎం జ్యోతిష్, అనిత పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని కదిరి డివిజన్ ఐపీఓ గోవర్ధన్‌నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తపాలా శాఖ అందిస్తున్న పలు పథకాలను వివరించారు. కార్యక్రమంలో పోస్టుమస్టార్ నరసింహమూర్తి, తపాలా సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.


తనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

అందుబాటులో మేలురకం పొద్దుతిరుగుడు విత్తనాలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 10: ఉమ్మడి జిల్లా రైతన్నలకు మేలురకం పొద్దు తిరుగుడు విత్తనాలు అందుబాటులో ఉన్నాయనీ, సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త జాన్సన్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. నంద్యాలలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో ఎన్డీఎస్ఏ-1012 (ప్రభాత్), హైబ్రీడ్ రకం 21 క్వింటాళ్లు, ఐఎస్ఎఫ్-764 అనే కుసుమరకం 16 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కేజీ పొద్దుతిరుగుడు విత్తనాలు రూ.500, కుసుమ రూ.110గా నిర్ణయించారన్నారు. ఆసక్తిగల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9989625208, 9966665434, 8142263221 నంబర్లలో సంప్రదించాలన్నారు.

20న కంటి వైద్యశిబిరం

ధర్మవరం, అక్టోబరు 10: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 20న కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. సభ్యులు నరేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివయ్య, ప్రసన్నకుమార్, రత్నశేఖర్‌రెడ్డితో కలిసి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. గ్రామీణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు


బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 10: మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుతోట హరిక్రిష్ణ, అశ్వర్థప్ప, బీజేవైఎం జిల్లా కార్యదర్శి నరేషబాబు, మండల ఉపాధ్యక్షులు నాగప్ప, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జనార్ధన్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు ఆర్జేడీని సస్పెండ్ చేయాలి

ధర్మవరం, అక్టోబరు 10: బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రాయలసీమ ప్రాంత రీజనల్ జాయింట్ డైరెక్టర్ రవి అక్రమాలపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ప్రగతి శీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ... పది సంవత్సరాలకు పైగా కడప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా ఉన్న రవి జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను శాసిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్‌గా ఉంటూ ఇన్‌చార్జ్ డీవీఈఓ, ఆర్జేడీగా వివిధ ఉన్నత పదవుల్లో జిల్లా అధికారిగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆయన డీవీఈఓగా, ఆర్ఐఓగా ఉన్న సమయంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ప్రస్తుతం ఆర్జేడీగా ఉంటూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయనపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని, ఆ స్థానంలో రెగ్యులర్ ఆర్జేడీని నియమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ పట్టణ అధ్యక్షుడు నందకిశోర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ స్వేచ్ఛ

కొత్తచెరువు, అక్టోబరు 10: స్థానిక వారపు సంతలో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని సీఐ ఇందిరా నిర్వహించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని తహసీల్దార్ నీలకంఠారెడ్డి ఎదుట హాజరుపరిచారు. చదువుకునే వయస్సు పిల్లలతో తల్లిదండ్రులు వెట్టిచాకిరీ చేయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్, సీఐ హెచ్చరించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

నల్లమాడ, అక్టోబరు 10: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశాన్ని గంటలోనే ముగించి చేతులు దులిపేసుకున్నారు. ఎంపీపీ సునీతాబాయి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏ ఒక్క సమస్యపై కూడా చర్చించలేదు. రెడ్డిపల్లి పంచాయతీలోని బాపనకుంట, బాపనకుంట ఎస్సీకాలనీ, నేరాలవంకతండా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని సభ్యులు అడుగగా, పరిశీలిస్తామని ఎంపీపీ సమాధానమించారు. ఇలా కంటితుడుపు చర్యగా.. గంటలోపే సమావేశం ముగించడం ఏమిటని సభ్యులు మండిపడుతున్నారు. ఈ సమావేశాల ద్వారా ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలి

ముదిగుబ్బ, అక్టోబరు 10: మండలంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు భర్తీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ విజయ భాస్కర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ... నాలుగు నెలలుగా మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో కూలీలకు పని కల్పించేవారు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేసి.. కూలీలు వలసలు పోకుండా వారికి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిప్పయ్య, రాధాకృష్ణ, చెన్నప్ప, శంకర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా..!

ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల దౌర్జన్యాలు.. ఆగడాలు ఆగలేదు. కొందరు అధికారులు, పోలీసులు ఇంకా వారికే వంతు పాడుతున్నారు. దీంతో న్యాయం జరగక బాధితులు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం ధర్మవరం పట్టణంలో వైసీపీ నాయకుల పెత్తనం ఇంకా కొనసాగుతూనే ఉంది.


బాలాజీ నగర్‌లో కబ్జా చేసిన స్థలంలో నిర్మించిన ఇల్లు


కౌన్సిలర్‌కు చెందిన స్థలం

వైసీపీ కౌన్సిలర్ దౌర్జన్యం...
- అధికారులను ఆశ్రయించిన స్థల బాధితులు
- అయినా దక్కని న్యాయం
- ప్రజాప్రతినిధి అండతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసిన కౌన్సిలర్
- ప్రభుత్వం మారడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- వారిపైనే కేసు బనాయించిన వైనం

ధర్మవరం, అక్టోబరు 10 : ధర్మవరం పట్టణానికి చెందిన వైసీపీ నేత చింతామారుతి మొదటి సారిగా కౌన్సిలర్ గెలుపొందారు. అధికారం అండగా ఉండటంతో అక్కడ ఆయన చెప్పిందే శాసనంగా మారింది. అదే అదునుగా భావించి ఒకచోట తన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని.. మరో స్థలంలో ఇంటిని నిర్మించాడు. బాధితులు తహసీల్దార్‌ను ఆశ్రయించినా న్యాయం దక్కలేదు. నాడు వైసీపీ అధికారంలో ఉండటంతో బాధితులు మిన్నకుండిపోయారు. ప్రభుత్వం మారడంతో బాధితులు ఇటీవల పోలీసులను ఆశ్రయించారు. అయితే వైసీపీ నాయకులతో ఇంకా కొంతమంది అధికారులు, పోలీసులు అంటకాగుతుండటంతో బాధితులకు న్యాయం జరగలేదు సరికదా... వారిపైనే కేసు నమోదు చేశారు.

అసలేం జరిగిందంటే..
పట్టణంలోని బాలాజీ నగర్‌లో 494 సర్వే నెంబరులో నాలుగు సెంట్ల స్థలాన్ని నాగరాజు కుమార్ అనే వ్యక్తి 1980 నవంబరు 3న రంగన అశ్వర్థనారాయణ, రంగన్న అచ్చప్పకు విక్రయించారు. అదే సర్వేనెంబరుతో గడ్డం రంగనాథ్ మరో స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ రెండు స్థలాల సర్వే నెంబరు ఒకటే అయినా.. డాక్యుమెంట్‌లో ఆ స్థలాలకు పొందుపరిచిన దిక్కులు... చెక్ బందీలు వేరు వేరు. అయినా అప్పటి నుంచి రంగన అశ్వర్థనారాయణ, గడ్డం రంగనాథ్ మధ్య స్థలం వివాదం మొదలైంది. దీంతో రంగన అశ్వర్థనారాయణ జిలకర శీన అనే వ్యక్తికి ఆ స్థలాన్ని అమ్మేశాడు. ఈ వివాదం విషయం తెలుసుకున్న కౌన్సిలర్ చింతామారుతి గడ్డం రంగనాథ్ నుంచి తక్కువ ధరకే 2023లో ఆ స్థలాన్ని కొనుగోలు చేశాడు. అంతేకాకుండా డాక్యుమెంట్‌లో పొందుపరిచిన చెక్ బంద్‌లోని స్థలంలో కాకుండా జిలకర శీనకు సంబంధించిన స్థలంలో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాడు. రంగన అశ్వర్థనారాయణ ఇంటి నిర్మాణానికి అడ్డుతగిలాడు. రాజీ మార్గంలో వెళ్దామన్నా... ఆ కౌన్సిలర్ పట్టించుకోలేదు. స్థలాన్ని ప్రభుత్వ సర్వేయర్ల ద్వారా కొలతలు వేయించి.. న్యాయంగా ఎవరికి చెందుతుందో వారమే తీసుకుందామని మొరపెట్టుకున్నా వినిపించుకోలేదు. దీంతో రంగన అశ్వర్థనారాయణ తహసీల్దార్‌ను సంప్రదించాడు. అయితే ఆ కౌన్సిలర్ తన అధికార దర్పంతో ఆ స్థలాన్ని కొలతలు వేయకుండా సర్వేయర్లను అడ్డుకున్నాడు. ఎప్పటికప్పుడు అడ్డుపడుతూ దౌర్జన్యంగా ఆ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసి.. అద్దెకు కూడా ఇచ్చాడు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కౌన్సిలర్ దౌర్జన్యంగా తన స్థలాన్ని కాజేసి ఇంటిని నిర్మించుకున్నా... బాధితులు మిన్నకుండిపోయారు. అంతేకాకుండా కొంత రోడ్డు స్థలాన్ని కూడా ఆక్రమించి ఆ ఇంటి నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వం మారినా..
ప్రభుత్వం మారడంతో తమ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి బాధితులు రంగన అశ్వర్థనారాయణ, జిలకర శీన పోలీసులను ఆశ్రయించారు. అయితే వీరే తనపై దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ ఆ కౌన్సిలర్ బాధితుల పైనే కేసులు పెట్టించాడు. ఆ కౌన్సిలర్‌కు మాజీ ప్రజాప్రతినిధి అండగా ఉండటంతో పోలీసు ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి కేసు నమోదు చేయించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. చివరికి తమ సొమ్ము పోయి.. కేసులు బనాయించుకునే పరిస్థితి వచ్చిందని ఆ బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం మారినా పోలీసులు వైసీపీ నేతలకే కొమ్ము కాస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రెగ్యులర్ తహసీల్దార్ లేక పాట్లు

గాండ్లపెంట, అక్టోబరు 10 : మండల తహసీల్దార్ కార్యాలయానికి రెగ్యులర్ తహసీల్దార్ లేక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం డిప్యూటీ తహసీల్దార్.. ఇన్‌చార్జి తహసీల్దార్ పాలనే సాగుతుండటంతో భూసమస్యలు పరిష్కారం కాలేదని రైతులు వాపోతున్నారు. ఇక్కడ తహసీల్దార్లు కనీసం మూడు నెలలు కూడా పని చేయకుండా డిప్యూటేషన్‌పై కొంతమంది, వివిధ పనులపై కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అవుతున్నారు. ఇటీవల ఎన్నికలు ముగిసిన తరువాత మూడు నెలల క్రితం వచ్చిన తహసీల్దార్ తిరిగి పుట్టపర్తిలోని కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఇటీవలే డిప్యూటీ తహసీల్దార్‌గా బాబూరావు బాధ్యతలు చేపట్టారు. కాగా, గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏ అధికారీ లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉన్నతాధికారి లేకపోవడంతో కిందిస్థాయి అధికారులూ కార్యాలయంలో ఉండటం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరిగారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.


గాండ్లపెంట తహసీల్దార్ కార్యాలయం


ఖాళీగా ఉన్న కుర్చీలు

కొత్తూరు అమ్మవారిశాలకు
బంగారు ప్రభావళి వితరణ


బంగారు ప్రభావళిని అందజేస్తున్న జయం కృష్ణమోహన్ దంపతులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 10 : నగరంలోని ఆర్కే నగర్‌కు చెందిన జయం క్రిష్ణమోహన్, అరుణ దంపతులు కొత్తూరు అమ్మవారిశాలకు బంగారు ప్రభావళి వితరణ చేశారు. దాదాపు రూ.10లక్షల వ్యయంతో తయారు చేయించిన బంగారు పూత ప్రభావళిని గురువారం రాత్రి స్థానిక కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహలును కలిసి అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి, అమ్మ వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని దాతలకు ఆలయ కార్యవర్గం చేతుల మీదుగా అందజేసి సత్కరించారు.

కొనసాగిన ఈయూ నిరసన

ధర్మవరం, అక్టోబరు 10: పనిభారాన్ని తగ్గించాలని ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన గురువారానికి ఐదో రోజుకు చేరుకుంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఆ సంఘం నాయకులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ... ఐదురోజులుగా నిరసన చేపడుతున్నా... సమస్యల పరిష్కారానికి డీఎం ఏ మాత్రం చొరవ చూపడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించేంతవరకు నిరసన ఆపబోమన్నారు. ఈ నిరసనలో ఈయూ డిపో కార్యదర్శి ముస్తాఫా, నాయకులు తిరుమలేశ్, బాబు,చింతా రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మండల నాయకులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 10: రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూక్‌ను గురువారం విజయవాడ సెక్రటేరియట్‌లో కలిసినట్లు మండల మైనార్టీ నాయకులు పొగాకు జాకీర్ అహమ్మద్, గండికోట ఇర్షాద్ చెప్పారు. ఈ సందర్భంగా కొండకమర్లలో మైనార్టీ షాదీమహల్ నిర్మాణ చేపట్టాలని, మైనార్టీలకు విరివిగా రుణాలు అందించి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. పలు మైనార్టీ సమస్యలను మంత్రికి వివరించినట్లు చెప్పారు. వీరితో పాటు రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జెరిపిటి అంజినప్ప ఉన్నారు.


మైనార్టీ శాఖ మంత్రితో మండల నాయకులు

ఊరేగిన దుర్గమ్మ

పుట్టపర్తి : దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతకు పల్లకి సేవ నిర్వహించారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఆలయంలోని అమ్మవారి ఉత్సవవిగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి పల్లకి సేవ నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో పండితులు యాగాలు నిర్వహించారు.



క్రైం న్యూస్ ..

పాముకాటుతో వ్యక్తి మృతి


విశ్వనాథ్‌రెడ్డి (ఫైల్)

నల్లచెరువు, అక్టోబరు 10: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో విశ్వనాథ్‌రెడ్డి (38) పాముకాటుతో గురువారం మృతిచెందారు. బోరు మోటార్ వద్దకు పంటకు నీరు పెట్టడానికి వెళ్లగా అక్కడ పాముకాటుకు గురయ్యాడు. సమీపంలోని రైతులు అతన్ని వెంటనే కదిరి ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించాడు. విశ్వనాథ్‌రెడ్డికి భార్య ఉంది.

యువకుడి ఆత్మహత్య

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 10 : మండలంలోని గౌనిపల్లికి చెందిన లేట్ నాగముని కుమారుడు జగదీష్ (30) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. నాగమునికి ఇరువురు సంతానం. రెండో కుమారుడు జగదీష్ ఇటీవల డీఎస్సీ టెట్ పరీక్షలు రాశారు. గత కొంతకాలంగా మానసిక స్థితి బాగలేకపోవడంతో కర్ణాటకలోని బెంగూళురులో చికిత్స పొందుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన అతను గ్రామ సమీపంలోని అక్కమ్మ కొండకు వెళ్లే దారిలోని సొంత పొలంలో చెట్టుకు గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన గొర్రెల కాపర్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి అన్న మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని ఏఎస్ఐ రమణారెడ్డి, జమేదార్ వెంకటేష్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాలుడికి గాయాలు

ధర్మవరంరూరల్, అక్టోబరు 10 : మండలంలోని పోతుకుంట బృందావనం కాలనీ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు గాయపడ్డాడు. పోతుకుంట బృందావనం కాలనీకి చెందిన బాబు కుమారుడు జయంత్ రోడ్డు దాటుతుండగా మామిళ్లపల్లి నుంచి ధర్మవరానికి వెళ్తున్న ఓ గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఆ బాలుడి ఎడమ కాలికి తీవ్రగాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు ఆ బాలుడిని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆర్‌సీపీ నాయకులపై కేసు

కదిరి, అక్టోబరు 10: పట్టణంలోని ఆర్‌సీపీ (రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ) నాయకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కోట వీధిలో నివాసముంటున్న హర్షవర్ధన్ 2018 సంవత్సరంలో మూర్తిపల్లి గ్రామస్థుల నుంచి కొత్త బైపాస్ రోడ్‌లో 3.81 ఎకరాల స్థలం కొనుగోలు చేశాడు. ఆ భూమిని ఇటీవల ఆర్‌సీపీ నాయకులు నాగన్న, ఇలియాజ్, అరుణ్‌తో పాటు మరో నలుగురు ఆక్రమించుకొని గుడిసెలు వేసుకున్నారు. ప్రశ్నించిన హర్షవర్ధన్‌పై వారు దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో అతను ఆ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారుపై కేసు నమోదు చేసుకున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

14 నుంచి పల్లె పండుగ

పుట్టపర్తి, అక్టోబరు 10 : పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, వాటిని ఓ పండుగలా నిర్వహించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పండుగ వాతావరణంలో పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహిం చాలన్నారు. ఆయా పంచాయతీలో చేపట్టే పనులకు భూమి పూజ కార్యక్ర మం చేయాలన్నారు. కార్యక్రమాల్లో స్థానిక అధికారులందరూ పాల్గొనాలని సూచించారు. జిల్లాలోని 32 మండలాల్లో డ్వామా ఆధ్వర్యంలో 1152 పల్లెలకు రూ. 78 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ సతమ, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అమ్మవారి ఊరేగింపు

తనకల్లు, అక్టోబరు 10 : దేశాయి రెడ్ల ఆడబిడ్డగా ప్రసిద్ధి చెందిన చౌడేశ్వరీ అమ్మవారిని దసరా సందర్భంగా తనకల్లులో శనివారం ఊరేగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి పురవీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తామని, ఆ సందర్భంగా చెక్కభజనలు, కోలాటం కార్యక్రమాలను నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

దుర్గమ్మా.. కరుణించమ్మా..



దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

లేపాక్షి, అక్టోబరు 9: దసరా శరన్నవరాత్రి వేడుకల 8వరోజు గురువారం లేపాక్షి ఆలయంలో అమ్మవారు.. దుర్గాదేవి అలంకరణలోనే భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గావీరభద్రస్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.
పలు ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్



మడకశిర: దుర్గాదేవిగా వడిసిలమ్మ

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణ తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

గోరంట్ల, అక్టోబరు 10: స్థానిక మండల కాంప్లెక్స్ సమీపాన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న పునాదిని గురువారం తొలగించారు. తహసీల్దార్ మారుతి.. వీఆర్వో మన్సూర్, వీఆర్ఏ వినోద్ తదితర సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్‌తో నిర్మాణాన్ని తొలగించి, చదును చేయించారు. సర్వే నంబరు 271లోని ప్రభుత్వ స్థలంలో 151 ప్లాట్లతో 2007లో లేఔట్ వేశారు. 2011లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ లేఔట్‌లోని ప్లాటు నంబరు 101కి సంబంధించి రెండు సెంట్ల ఇంటి స్థలం పట్టా సుశీలమ్మ పేరుమీద 2003లోనే అధికారులు ఇచ్చినట్లు లబ్ధిదారురాలు తెలిపారు. ఇది అక్రమమని తేల్చి, తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసు కూడా ఇవ్వకుండా పునాదులను ఎలా తొలగిస్తారని సుశీలమ్మ భర్త భాస్కర్.. తహసీల్దార్‌ను నిలదీశారు. హైకోర్టులో విచారణ కొనసాగుతుండగా పనులు ఎలా చేపడతామని తహసీల్దార్ మండిపడ్డారు. గత వైసీపీ పాలనలో వందకుపైగా అక్రమ నిర్మాణాలు ఒకేసారి చేపట్టడంతో అప్పటి తహసీల్దార్ రంగనాయకులు, సీఐ సుబ్బరాయుడు వాటిని తొలగించి, నిర్మాణ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా కొంతమంది తమకు పట్టా ఉందంటూ కోర్టును ఆశ్రయించి, ఇష్టారాజ్యంగా భవనాలు నిర్మించుకుని, నివాసాముంటున్నారు. సెలవు రోజుల్లో రాత్రిపూట నిర్మిస్తుండడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. ప్రస్తుతం వాటిని తొలగిస్తున్నారు. భూవివాదం కోర్టులో ఉండగానే నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేసి, బైండోవర్ చేస్తామని తహసీల్దార్ తెలిపారు.



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మడకశిర డిపోను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.. కర్నూలుకు బస్సు సర్వీసు ప్రారంభం



నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

మడకశిరటౌన్, అక్టోబరు 10: మడకశిర డిపోను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మడకశిర డిపో నుంచి ఉదయం 5 గంటలకు వెళ్లే కర్నూలు సర్వీస్‌కు కొత్త బస్సును టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే అమరాపురం బస్టాండులో జెండా ఊపి గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. డిపో మేనేజర్ రామసుబ్బయ్య, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు నాగరాజు, మంజునాథ్, సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీఓ: పెనుకొండ ఆర్డీఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆనందకుమార్ గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలను మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఆనందకుమార్ మడకశిర తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్డీఓకు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, నియోజకవర్గంలో భూములకు సంబంధించి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

కనకాంబరం కిలో రూ.2వేలు



హిందూపురం, అక్టోబరు 10: దసరా పండగంటే పదిరోజుల వేడుక. దీంతో పూల ధరలకు రెక్కలొచ్చాయి. అమాంతం ధరలు పెరిగిపోయాయి. శరన్నవరాత్రి నేపథ్యంలో ప్రస్తుతం పూలధరలు ఒకేసారి పెంచేశారు. గురువారం మార్కెట్‌లో పూల ధరలు ఆకాశాన్నంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కనకాంబరం పూల దిగుబడి తగ్గి, మార్కెట్‌కు తక్కువగా వచ్చాయి. దీంతో ధర కిలో రూ.1800 నుంచి రూ.2వేలకు పెరిగింది. మల్లెపూలు రూ.1000 నుంచి రూ.1200దాకా పలుకుతున్నాయి. బంతిపూలు కిలో రూ.80 నుంచి రూ.120 ఉండగా.. చామంతి రూ.200 నుంచి రూ.300దాకా పలుకుతున్నాయి. ఈ ప్రాంతంలో చెండుపూలు సాగు చేసిన రైతులు అధికశాతం తెలంగాణ ప్రాంతానికి తరలించారు. బతుకమ్మ, నవరాత్రి సందర్భంగా హైదరాబాద్ ప్రాంతంలో పూలకు గిరాకీ ఉంటుందని రైతులు అక్కడికి ఎగుమతి చేశారు. గురువారం హిందూపురం మార్కెట్‌లో పూలధరలు అమాంతం పెంచేశారు. వారం క్రితం వరకు చెండుపూలు కిలో రూ.30 ఉండగా.. ప్రస్తుతం వందకు పెరిగింది. వారం క్రితం చామంతి కిలో రూ.100 ఉండగా.. గురువారం 200 నుంచి రూ.300 తో అమ్ముడుపోయింది. గులాబీలు రూ.250 నుంచి రూ.300దాకా విక్రయించారు.



మార్కెట్‌లో పూల విక్రయాలు

రతన్‌టాటా మృతి దేశానికి తీరనిలోటు : బీకే



రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీకే, నాయకులు

పెనుకొండ, అక్టోబరు 10: ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్, టాటాగ్రూప్స్ ఛైర్మన్ రతన్‌టాటా మృతి భారతదేశానికి తీరనిలోటని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. టాటాఅంటే భారతదేశ ఉనికిగా అంతర్జాతీయ సమాజం ముందు నిలబెట్టారన్నారు. ఆయన పారిశ్రామికవేత్తగా కాకుండా గొప్ప మానవతావాదిగా సమాజానికి సేలందించారన్నారు. కొవిడ్ సమయంలో 1500 కోట్లు విరాళం ఇచ్చిన మహనీయుడన్నారు. నాయకులు జీవీపీ నాయుడు, సుబ్బరాయుడు, రవిశంకర్, అనిల్‌కుమార్, నాని, చంద్రమౌళి, గాయిత్రి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాచండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 10: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కంసలపేటలో వెలసిన చౌడేశ్వరీ ఆలయంలో గురువారం మహాచండీ యాగాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవాంగ సంఘం ఆధ్వర్యంలో విరూపాక్షేశ్వరస్వామి, చౌడేశ్వరీమాతలకు ఉదయం నుంచి వివిధ అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. అనంతరం మహాచండీ యాగం చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవాంగ సంఘం అధ్యక్షుడు సోమశేఖర్, కార్యదర్శి నంజుండప్ప, కోశాధికారి రాజశేఖర్, మునిరంగప్ప, వెంకటస్వామి, శంకరప్ప, ప్రధాన అర్చకుడు నవీన్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

కొత్తూరు అమ్మవారిశాలకు బంగారు ప్రభావళి వితరణ



బంగారు ప్రభావళిని అందజేస్తున్న జయం కృష్ణమోహన్ దంపతులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 10: నగరంలోని ఆర్కే నగర్‌కు చెందిన జయం క్రిష్ణమోహన్, అరుణ దంపతులు కొత్తూరు అమ్మవారిశాల కు బంగారు ప్రభావళి వితరణ చేశారు. దాదాపు రూ.10లక్షల వ్యయంతో తయారు చేయించిన బంగారు పూత ప్రభావళిని గురువారం రాత్రి స్థానిక కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులును కలిసి అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి, అమ్మ వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని దాతలకు ఆలయ కార్యవర్గం చేతుల మీదుగా అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మిట్టా ఆంజనేయులు, టంగుటూరి నాగ భూషణం, తల్లం మురళి, కృష్ణం రఘు, జయం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

గోరంట్ల, అక్టోబరు 10: బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గోరంట్లలోని పలు దుకాణాలు, హోటల్స్, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు తదితర చోట్ల గురువారం పోలీసులు తనిఖీ చేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, పోలీస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి గాలించారు. పట్టణంలోని పలు వ్యాపార కేంద్రాలనుంచి 13మంది బాలబాలికలు పనిచేస్తూ పట్టుబడగా, వారిని స్టేషన్‌కు పిలిపించి, వారి ఆధార్ కార్డు ఆధారంగా వయస్సు నిర్ధారించారు. బాలకార్మికులుగా పనిచేస్తున్న వారి తల్లిదండ్రులు, వారితో పనిచేయించుకుంటున్న దుకాణదారులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టరీత్యా బాలబాలికలు పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసించాలని, అలాకాకుండా చిన్న వయస్సులో పనిచేయడం నేరమన్నారు.

రతన్ టాటాకి నివాళి



రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 10: భారతదేశ దిగ్గజ వ్యాపారవేత్త టాటాగ్రూప్ ఛైర్మన్ రతన్‌టాటా మృతికి స్థానిక టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశమై రతన్‌టాటా సేవలను కొనియాడారు. ఆదాయంలో సగభాగం సమాజసేవకు ఉపయోగించారన్నారు. కొవిడ్ సమయంలో కొన్ని వందల కోట్లు విరాళం ఇచ్చిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరాములు, నంజుండ, వాసుదేవరెడ్డి, బాబిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరి మహేశ్వరి పీఠంలో ప్రత్యేక పూజలు

పెనుకొండ రూరల్, అక్టోబరు 10: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చంద్రగిరి గ్రామంలో వెలసిన శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి గణపతిహోమం, పుష్పాలంకరణ, చండీహోమం, అమ్మవారికి ఉయ్యాల సేవ, మహామంగళహారతి, తీర్థ ప్రసాదాలు నిర్వహించినట్లు శ్రీగిరి శక్తిపీఠం వ్యవస్థాపకులు దేవేంద్రస్వామి తెలిపారు.



అలంకరణలో అమ్మవారు

14 నుంచి పల్లె పండుగ

పెనుకొండ రూరల్, అక్టోబరు 10: రొద్దం మండలంలో 14 నుంచి పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాంకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 20వ తేదీవరకు గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తారన్నారు. మండలంలో 73 పనులకు గాను రూ.5.35కోట్లకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైనట్లు తెలిపారు.

మద్యం షాపులకు 183 దరఖాస్తులు

పెనుకొండ, అక్టోబరు 10: పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 13 మద్యం దుకాణాల నిర్వహణకు 183 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. గురువారం 13 దరఖాస్తులు దాఖలైనట్లు ఆయన తెలిపారు. 11న శుక్రవారం టెండర్ల దాఖలకు ఆఖరి తేదీ అన్నారు.

ఎట్టకేలకు మోడల్ కాలనీకి నీరు

హిందూపురం అర్బన్, అక్టోబరు 10: చాలా రోజులుగా మోడల్ కాలనీకి నీరు రాకపోవడంతో ఆ వార్డు బీజేపీ కౌన్సిలర్ అంజలి సహకారంతో గురువారం నీటిని అందించారు. వార్డుకు నీరు సరఫరా కాకపోవడంతో నీటి పైప్‌లైన్లు తొలగించి వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు. మున్సిపల్ డీఈ స్పందించి కొత్త పైప్‌లైన్లు ఏర్పాటుచేశారు. వార్డుకు నీరు అందటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



పైప్‌లైన్‌ను పనులు చేయిస్తున్న దృశ్యం

వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం, అక్టోబరు 10: కడుపునొప్పిని భరించలేక జీవితంపై విరక్తిచెందిన సంజీవరాయుడ(40)అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం తెలిపిన మేరకు శ్రీకంఠపురం ప్రాంతానికి చెందిన సంజీవరాయప్ప కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం అర్ధరాత్రిదాటాక కెంచ కళ్యాణమండపం సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంజీవరాయుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తాం: కలెక్టర్





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, నృత్యం చేస్తున్న కళాకారిణి

లేపాక్షి, అక్టోబరు 10: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ చేతన్ అన్నారు. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగం గా దుర్గావీరభద్రస్వామి ఆలయం వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కలెక్టర్ జ్యోతి వెలిగించి, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. లేపాక్షిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. జటాయువుపక్షి, టూరిజం శాఖ రెస్టారెంట్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పించి, పర్యాటకుల సంఖ్య పెంచడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

13న అమ్మాజీ జాతర

రొళ్ల, అక్టోబరు 10: మండలంలోని జీరిగేపల్లిలో వెలిసిన మారక్క, గ్యారక్క, ముదుపక్క అమ్మవార్లకు 13వతేదీ ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జాతర నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. జాతరకు ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి తమ మొక్కుబడులు తీర్చుకొంటారు. జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.



అమ్మవారి మూలవిరాట్టు

లింగాయత్‌లను ఓబీసీలోకి చేర్చండి



ఎంపీ బీకేకు వినతి ఇస్తున్న లింగాయత్‌లు

హిందూపురం అర్బన్, అక్టోబరు 10: వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలోకి చేర్చాలని బుధవారం రాత్రి హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణలకు వినతి అందించారు. అన్ని రంగాల్లో వెనుకబడిన లింగాయత్‌లను ఓబీసీలోకి చేర్చి ప్రాధాన్యం కల్పించాలని వారిని కోరారు. లింగాయత్‌లు ఆది నుంచి టీడీపీ పార్టీకి వెన్నంటి ఉన్నారని, వారిని గుర్తించి ఓబీసీలోకి చేర్చే విధంగా పార్లమెంట్‌లో గళం విప్పాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గోరంట్ల, అక్టోబరు 10: మండలంలోని బీఎన్ తండా సమీప గుట్టలో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడిచేసి, 14 మందిని అరెస్టు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. పాలసముద్రం సమీపంలో జూదమాడుతున్నారన్న సమాచారంపై పోలీసులు దాడి చేసి, రూ.1,03,320, పది ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

సోమందేపల్లి, అక్టోబరు 10: మండల కేంద్రంలోని జగ్జీవన్‌రామ్‌నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త నారాయణ గురువారం అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న టీడీపీ నాయకులు నీరుగంటి చంద్రశేఖర్, పట్టణ కన్వీనర్ సూరీ, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప నారాయణ భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ కుటుంబాన్ని ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే మండలకేంద్రంలోని వినాయకనగర్‌కు చెందిన జగన్నాథ్‌నాయక్ కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతుండగా గురువారం టీడీపీ నాయకులు పరామర్శించారు.

దరఖాస్తు చేసుకోండి

అమరాపురం, అక్టోబరు 10: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారులు రాఘవయ్య, వెంకటనారాయణ్ ఒక ప్రకటనలో కోరారు. పొరుగు సేవల ప్రాతిపదికన నియమిస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను 15వతేదీ సాయంత్రం 4 గంటలలోపు మండల ఎమ్మార్సీ కార్యాలయంలో సమర్పించాలని వారు తెలిపారు.

శక్తిపీఠాన్ని సందర్శించిన మాజీ మంత్రి

పెనుకొండ రూరల్, అక్టోబరు 10: మండలంలోని చంద్రగిరి గ్రామంలో వెలసిన శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠాన్ని మాజీ మంత్రి శంకర్‌నారాయణ గురువారం సందర్శించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చంద్రగిరి గ్రామంలో గురువారం మహేశ్వరి శక్తిపీఠంలో గత వారం రోజుల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి.. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు దేవేంద్రస్వామి ఆయనను సన్మానించారు.



పూజల్లో పాల్గొన్న శంకర్‌నారాయణ

రెండేళ్లుగా కానరాని పశువైద్యులు

- మూగజీవాలకు అందని వైద్యం
- పాడి రైతులకు తప్పని పాట్లు

అగళి, అక్టోబరు 10: మండలంలో రెండేళ్లుగా పశువైద్యాధికారి లేకపోవడంతో మూగజీవాలకు వైద్యం కరువైంది. మడకశిర నియోజకవర్గంలోని నీలకంఠాపురంలో మినహా అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రైతులకు ప్రభుత్వ పథకాలు దూరమయ్యాయి. దీనికితోడు హెచ్‌డిహళ్లి పంచాయతీలో ఏ ఒక్కరూ లేరు. మండలంలో చాలా మంది రైతులు పాడి ఆవులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన ఆవులు రోగాల బారిన పడితే రైతులు కష్టం దేవుడికే ఎరుక. సీజనల్ వ్యాధులు, ఇతర సమస్యలకు పక్కనున్న కర్ణాటక వెటర్నరీ డాక్టర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు మండలంలో పాలశీతలీకరణ కేంద్రం లేక వేలాది లీటర్లపాలు రోజూ కర్ణాటకకు తరలిపోతున్నాయి. అయితే పాల బిల్లులు సక్రమంగా అందడంలేదని కొందరు రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో మూగజీవాలకు వైద్యం అందించేందుకు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైద్యులు కరువయ్యారు. పశుగ్రాసం దాణా పంపిణీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద పశువుల కోసం తొట్టెలు, గొర్రెల, మేకల షెడ్ల నిర్మాణం తదితర ఎన్నో పథకాలు వైద్యుల ఆధ్వర్యంలోనే రైతులకు అందించాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు పశువైద్యాధికారులను నియమించి పాడిరైతులకు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సకాలంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు

పెనుకొండ రూరల్, అక్టోబరు 10: ముఖ్యమంత్రి చంద్రబాబు సకాలంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్నారని టీడీపీ నాయకులు మాధవనాయుడు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు టైలర్‌ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని కోగిర గ్రామంలో అన్నదాత సుఖీభవ కేంద్రంలో నల్లరేగడిభూములున్న రైతులకు సబ్సిడీతో పప్పుశనగవిత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి నివేదిత, ఆర్బీకే సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు